


## జిల్లాకేంద్రంలో కుండపోత

● కట్టంగూరులో 10 సెం.మీ.ల వర్షం



పానగల్ బైపాస్ వద్ద జలమయమైన ప్రధాన రహదారి

7



రూ.6.50లక్షల విలువైన రోల్

# రూ.లక్షకే విక్రయం

● వైటీపీఎస్‌లో 28 రోల్స్ చోరీ ● ఐదుగురు అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు



7




# టీటీడీ బోర్డు సభ్యుడిగా నర్సిరెడ్డి

● రామన్నపేట మండలం సిరిపురంవాసుల హర్షం

6




దీపావళి పండుగ

# ఆనందం ..నిండుగ



దీపావళి పండుగను జిల్లా ప్రజలు గురువారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకోనున్నారు. ఇప్పటికే ఇంటి ఆడపిల్లలు, కుటుంబ సభ్యులతో ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. దీపావళి వ్రతాలు నోముకునేందుకు మహిళలు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. లక్ష్మిపూజ, ధనలక్ష్మి, కేదారేశ్వర వ్రతాలను మహిళలు ఆచరిస్తారు. అందుకు సంబంధించిన వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. గృహాల వద్ద దీపాలను వెలిగించేందుకు ప్రమిదలను సిద్ధం చేసుకుంటు న్నారు. దీపావళి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రధాన ఆలయాలను ముస్తాబుచేశారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయాలన్నీ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. భక్తులు ఆలయాలను దర్శించుకునేందుకు వీలుగా ఆలయ కమిటీలు ముమ్మరంగా ఏర్పాట్లుచేశాయి. దీపకాంతులతో మహాలక్ష్మి వ్రతాలు, కేదారేశ్వర వ్రతాలు నోములు చేయడం సకల శుభాలు కలుగుతాయని నమ్మకం.

6







# సకాలంలో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

● బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేయాలి ● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రెండు రోజుల్లో డబ్బులు జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లాకేంద్రం సమీపంలోని అర్జాలబావి, ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ల వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీచేసి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. రైతులు విక్రయించిన ధాన్యం డబ్బులు వారి ఖాతాలో రెండు రోజుల్లో జమయ్యేందుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు కొనుగోలు కేంద్రాల్లో అందజేస్తే రెండురోజుల్లోనే వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, జిల్లా సహకార శాఖ అధికారి పత్యా నాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలకుంట్ల నాగరత్నం రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

### 10శాతం బ్యాంకు గ్యారెంటీతో సీఎంఆర్ కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల ప్రకారం ఇప్పటివరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో ఎలాంటి ఆరోపణలులేని రైస్ మిల్లులకు 10శాతం బ్యాంకు గ్యారంటీతో సీఎంఆర్ కేటాయించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో 2024-25 ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కేటాయింపు, అదనపు మిల్లింగ్ చార్జీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వానాకాలం ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు సంపూర్ణ సహకారం అందించాలన్నారు.







# ఏదుల నుంచి డిండికి కృష్ణాజలాలు

● రూ.2200కోట్ల అంచనావ్యయం

'డిండి' పథకంలో కీలక అడుగు పడింది. ఈ ఎత్తిపోతల పథకానికి నీరెక్కడి నుంచి తీసుకోవాలనే విషయంలో ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తీసుకునేందుకు నిర్ణయించింది. మూడేళ్లలో ఆయకట్టుకు నీరిచ్చేందుకు చర్యలు చేపట్టింది.




7

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)















# దీపావళి పండగ.. ఆనందం నిండుగ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెలుగుల పండుగ దీపావళి సందడి నెలకొంది. గ్రామం నుంచి పట్టణం వరకు పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఆలయాలను, వాణిజ్య సంస్థలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బాణసంచా దుకాణాల వద్ద కొనుగోలుదారులు కిక్కిరిశారు. దీపావళి ప్రత్యేక ప్రమిదలు, కుండలు, పండ్లు, పూలు, గుమ్మడికాయలు, పూజా సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది. గురువారం లక్ష్మీ పూజలను నిర్వహించనుండగా శుక్రవారం కేదారేశ్వరి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించనున్నారు. ఆలయాలలో సామూహిక వ్రతపూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో శైవ ఆలయాల్లో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, వ్రతాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

● భువనగిరి టౌన్, నల్లగొండ కల్చరల్,(ఆంధ్రజ్యోతి)

● ముస్తాబైన ఆలయాలు ● ముమ్మరంగా ప్రమిదల విక్రయాలు







పండుగకు పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాలన్నీ దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. భక్తులు ఆలయాలను దర్శించుకునేందుకు వీలుగా ఆలయ కమిటీలు ముమ్మరంగా ఏర్పాట్లు చేశాయి. దీపకాంతులతో మహాలక్ష్మి వ్రతాలు, కేదారేశ్వర వ్రతాలు నోమటం వల్ల సకల శుభాలు కలగనున్నాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి వ్రతాలను ఆచరించిన అనంతరం ఇంటి ఆవరణలో ప్రమిదలతో దీపాలను వెలిగించనున్నారు. వ్రతాలు, పూజలకు సంబంధించిన సామాగ్రిని కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఇంటికి చేరారు

### పెరిగిన బాణాసంచా విక్రయ దుకాణాలు



బాణాసంచా విక్రయ దుకాణాలు పెరిగాయి. బాణాసంచా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. పలు దుకాణాలు కనీస నిబంధనలు, జాగ్రత్తలు పాటించడం లేదని పలువురు అంటున్నారు. అనుమతుల మంజూరులో అగ్ని మాపక, పోలీస్ శాఖల లెక్కలకు క్షేత్రస్థాయిలో తేడాలు ఉన్నట్లు ప్రచారమవుతోంది. దీంతో అనుమతుల మంజూరీ, దుకాణాల నిర్వాహణపై సంబంధిత శాఖలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో దుకాణం నుంచి రెండు శాఖల సిబ్బంది కలిసి రూ.10 నుంచి రూ.12 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు.

### తెల్లవారుజామునే మంగళహారతులు..

నరక చతుర్దశి కావటంతో బుధవారం మంగళ హారతులను జరుపుకోనున్నారు. తెల్లవారుజామునే ఆడపిల్లలు తల్లిదండ్రులు, అన్నదమ్ముళ్లకు హారతులిస్తారు. ఈ హారతుల వల్ల కుటుంబ యశస్సు పెరుగుతుందని నమ్మకం. కొందరు లక్ష్మీదేవి పూజలను కూడా నిర్వహించారు. ఇంటిల్లిపాది అంతా దీపావళి పండుగలో నిమగ్నమయ్యారు.



### పూజలు, వ్రతాలు

రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా అంతటా దీపావళి పూజలను నిర్వహించనున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి అమావాస్య ప్రవేశిస్తుండడంతో సాయంత్రం లక్ష్మీ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచే ఆలయాలను సందర్శించేందుకు ప్రజలు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లుచేస్తున్నారు. శుక్రవారం స్వాతి నక్షత్రం ఉండటంతో కేదారేశ్వరి నోముతో పాటు సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించనున్నారు. దీంతో రెండు రోజుల పాటు భక్తిపూర్వ వాతావరణం నెలకొననుంది. యాదాద్రి జిల్లా అంతటా మట్టి ప్రమిదలు, పూజా సామాగ్రి విక్రయాలు పెరిగాయి. రాశులుగా పోసి బంతిపూలను విక్రయిస్తున్నారు. కిలో రూ.70నుంచి రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. రెండు రోజుల పాటు రాత్రి పూట బాణసంచా కాల్చనుండడంతో ఆకాశంలో వెలుగుల పువ్వులు విరబూయనున్నాయి. అదే సమయంలో జనావాసాల మధ్య బాణసంచా చప్పుళ్లు మారుమోగనున్నాయి. పలువురు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటుకానున్నాయి. జిల్లా అంతటా బుధవారం పాఠశాలలో దీపావళి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## చీకటిని పారదోలే పండగ

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ప్రజలకు బుధవారం ఒక ప్రటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని తెలిపారు. అజ్ఞానాంధాకారాన్ని పారదోలి జ్ఞానపుకాంతులు ప్రసరింపజేయాలనే తత్వాన్ని దీపావళి నేర్పుతోందని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

● రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ముందుకుసాగుతున్నామని, చీకటి తొలగించి వెలుగులు నిండే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలందరూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి

● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటే చెడుపై మంచి గెలిచిన రోజని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో పయనించాలన్నారు. పండుగలు మన సంస్కృతిని తెలియజేస్తాయన్నారు. ప్రతి కుటుంబంలో వెలుగులు విరబూయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సాగునీటికి పెద్దపీట వేస్తున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

## అజ్ఞానాంధకారాన్ని తొలగించాలి

● మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి



సూర్యాపేట సిటీ, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని, దీపాల కాంతుల వలే తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులతో నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ శుభాకాంక్షలు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. నరకాసుర వధతో దీపావళి పండుగ జరిగినట్లు, మన తెలంగాణలోనూ చీకట్లు తొలిగి అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించాలన్నారు. బాణసంచా పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## కొత్త ఆశలు నింపాలి

● సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూర్యాపేట కలెక్టరేట్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ చీకట్లను తొలగించి, జీవితాల్లో కొత్త ఆశలు నింపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సంతోషాలు, శ్రేయస్సు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికి సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, ప్రజలందరికి జీవితాల్లో శోభాయమానంగా వెలుగొందాలని, ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## పండుగగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగ నిర్వహించుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆకాంక్షించారు. ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని కోరారు. అందరి జీవితాలు సుఖమయంగా ఉండాలని కాంక్షించారు. బాణాసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందరూ సంతోషంగా పండుగ జరుకోవాలని కోరారు.

## నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండల ంలోని చలకుర్తి క్యాంప్ జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆన్‌లైన్ గడువును నవంబరు 9వ తేదీ వరకు పొడి గిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8, 10వ తరగతి చదు వుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి నవంబరు 9 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో ఫారం నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష హిందీ, ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుందని, మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీషు, గణితం, సోషల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయని తెలిపారు.

## అంతర్జాతీయ డ్రాగన్‌బోట్ పోటీలకు ప్రభాకర్



తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలోని డొక్కలబావితండాకు చెందిన మాలోతు ప్రభాకర్ అంతర్జాతీయ డ్రాగన్ బోట్ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు ఫిలిప్పీన్స్‌కు వెళ్లాడు. రెండేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఈ నెల 30 నుంచి నవంబరు 4వ తేదీ వరకు ఫిలిప్పీన్స్‌లో నిర్వహి ంచనున్న పోటీలకు మన దేశం తరుపున పాల్గొంటున్నాడు. డొక్కలబావితండాకు చెందిన మాలోతు మంగ్తానాయక్, కమల దంపతుల కుమారుడైన ప్రభాకర్ 1నుంచి 4వ తరగతి వరకు స్థానిక భారతీయ సార్వత్రిక విద్యాలయంలో చదివాడు. క్రీడల్లో ఆసక్తి కనబరుస్తుండడంతో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అతనిని ప్రోత్సహించడంతో హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి బాపూజీనగర్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రభాకర్ పాఠశాల కోచ్ భూపాల్ నేతృత్వంలో శిక్షణ పొందాడు. ప్రస్తుతం ప్రభాకర్ 7వ తరగతి చదువుతున్నాడు. మారుమూలతండాకు చెందిన గిరిజన విద్యార్థి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు తేజ విద్యార్థులు

కోదాడ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ రమా సోమిరెడ్డి తెలిపారు. నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు సౌజన్య, ఉదయ్‌లు అభినందించారు.

## భిక్షవమ్మకు ఉత్తమ గాయని అవార్డు



అవార్డు అందుకుంటున్న భిక్షవమ్మ

మాడ్గులపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన కొండేటి భిక్షవమ్మ గత పది సంవత్సరాల నుంచి కోలాటం మాస్టర్‌గా, భజన మాస్టర్‌గా ఎన్నో గ్రామాల్లో కోలాటం నేర్పించి సాధారణ సింగర్‌గా ఉండేవారు. కాని పల్లెటూరిలో పుట్టిన భిక్షవమ్మ గాత్రంతో ఎంతో మంది మనసులు గెలుచుకుంది. సాధారణ సింగర్‌గా ఉన్న భిక్షవమ్మకు తన స్వరం పాటలు వినిపించడం ద్వారా మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ ఇచ్చిన అవకాశంతో 'లెగరా సాంబయ్య' అనే పాట ద్వారా తన పాటల ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ పాటకు పెద్ద ఆదరణ రావడంతో తక్కువ సమయంలోనే సింగర్ మంగ్లీతో కలిసి పాడే అవకాశం వచ్చింది. అప్పుడు సింగర్ మంగ్లీతో కలిసి బోనాల సందర్భంగా 'రావుతల్లి రావుతల్లి ముత్యాలమ్మ' అనే పాట పాడి గొప్ప పేరు రావడంతో ఆదే పాటకుగాను పద్మమోహన బుల్లి తెర అవార్డులో భాగంగా బుధవారం 2024 సంవత్సరానికి గాను బెస్ట్ సింగర్ అవార్డును అందుకోవడం జరిగిది. భిక్షవమ్మ మాట్లాడుతూ పాటలు పాడడానికి అవకాశం ఇచ్చి నన్ను అన్ని రకాలుగా ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంజీయూ సెమిస్టర్ ఫలితాల విడుదల

నల్లగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎంబీఏ జనరల్, ఎంబీఏ టీటీఎం ఒకటి, రెండు, మూడు, నాలుగు సెమిస్టర్ల రెగ్యులర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఫలితాల విడుదల ఎంబీఏ జనరల్ నాలుగో సెమిస్టర్‌లో 200 మంది విద్యార్థులకు గాను 191మంది ఉత్తీర్ణత సాధించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

# అండర్-17 బాలుర కబడ్డీ విజేత సూర్యాపేట జట్టు

● అండర్-17 బాలికల విజేత హుజూర్‌నగర్ ● పోటీల్లో పాల్గొన్న ఎనిమిది కబడ్డీ జట్లు, 150 మంది క్రీడాకారులు

హుజూర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంప్ స్కూల్ ఆవరణలో అండర్-17, 14 జిల్లాస్థాయి బాలబాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హుజూర్‌నగర్‌లో రూ.5కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. అండర్-17 బాలుర పోటీల్లో సూర్యాపేట నియోజకవర్గ జట్టు మొదటి స్థానం, హుజూర్‌నగర్ జట్టు రెండవ స్థానం సాధించాయి. కాగా బాలికల విభాగంలో అండర్-17 పోటీల్లో హుజూర్‌నగర్ మొదటి బహుమతి, సూర్యాపేట ద్వితీయ బహుమతి గెలుపొందారు. అదేవిధంగా అండర్-14 బాలుర విభాగంలో హుజూర్‌నగర్(ప్రథమ), తుంగతుర్తి(ద్వితీయ) స్థానం సాధించాయి. అండర్-14 బాలికల విభాగంలో కోదాడ ప్రథమ, సూర్యాపేట ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం ఎనిమిది జట్లకు చెందిన 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు రవి, సరళాదేవి, జనార్ధన్‌రెడ్డి, ప్రదీప్, మైసయ్య, ఉస్మాన్, పోతురాజు రమేష్, రాజు, బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, మంగయ్య, సుధాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉప్పల రమేష్ ఉన్నారు.



అండర్-17 పోటీల్లో తలపడుతున్న బాలికల జట్లు

## టీటీడీ బోర్డు సభ్యుడిగా నన్నూరి నర్సిరెడ్డి

రామన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యుడిగా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి నన్నూరి నర్సిరెడ్డి నియామకమయ్యారు. సిరిపురంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నర్సిరెడ్డి పదో తరగతి వరకు సిరిపురం ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ హైదరాబాద్‌లో చదివారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తిచేశారు. పీజీ చదివే క్రమంలో విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. దివంగత మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి పరిచయంతో ఆయన తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్)లో కీలక నేతగా వ్యవహరించారు. అనంతరం టీడీపీలో అంచెలంచెలుగా ఎదిగారు. పిట్టకథలు, సామెతలతో ప్రసంగించడం ఆయన ప్రత్యేకత. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొంత క్యాడర్ వెళ్లిపోయినా నిరుత్సాహపడలేదు. ఏపీ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడుతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. నర్సిరెడ్డికి ఒక సోదరుడు కాగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. తల్లిదండ్రులు మృతిచెందారు. సిరిపురంలో ఇల్లు, పొలం ఉంది. ఆయన హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. నర్సిరెడ్డి నియామకంపై స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# కార్మికుల గ్రామం.. మట్టపల్లి

● నాడు 11గృహాలు.. నేడు 320కి పైగా కుటుంబాలు

● సున్నపురాయి గనులే అన్నంపెట్టే వనరులు

● మట్టపల్లిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహుడు

**సూర్యాపేట జిల్లాలో కృష్ణానది తీరాన లక్ష్మీనృసింహుడు కొలువైన ప్రాంతం మట్టపల్లి. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న సున్నపురాయి గనులే ఈ ప్రాంతానికి జీవనోపాధి కల్పించే కల్పతరువులు. మూడు దశాబ్దాల కిందట ఐదు కుటుంబాలు, 11 గడపలతో ఉన్న ఈ గ్రామం నేడు కార్మికుల గ్రామంగా పేరొందుతోంది. సిమెంట్ పరిశ్రమ రాకతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం 300కు పైగా కుటుంబాలు, 1600 జనాభాతో అభివృద్ధిలో ఉంది. ప్రతి ఇంటి నుంచి ఒకరు పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. సిమెంట్ పరిశ్రమతో ఇక్కడి జీవన ప్రమాణాలు ముడిపడిపోయాయి.**

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రం ఒకప్పుడు చిన్న కుగ్రామం. మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ గ్రామానికి చేరుకోవాలన్నా సరైన రవాణా, రహదారి సౌకర్యాలు ఉండేవి కావు. ఐదు కుటుంబాలు, 11గృహాలు ఉండేవి. గ్రామ ంలో దేవాలయంలో పనిచేసే అర్చకులు, మత్స్య కార్మికులు, నాలుగు వ్యవసాయ కుటుంబీకులు మాత్రమే ఉండేవారు. అటవీ ప్రాంతం, కృష్ణానదీ ఒడ్డున సున్నపు రాయి గనులు తప్ప మరో ఉపయోగకరమైన జీవనాధారంలేని గ్రామంగా మట్టపల్లి ఉండేది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో జనసంచారం ఉండేది కాదు. ఇక్కడి వారికి వ్యవసాయం మాత్రమే జీవనాధారంగా ఉండేది. ఇక్కడ స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనృసింహా స్వామి చుట్టుపక్కల వారికి ఇష్టదైవంగా ఉండేవారు. అప్పుడప్పుడు వచ్చే భక్తుల రాకతప్ప మరే సందడి ఉండేది కాదు.



### ఇతర రాష్ట్రాల నుంచి

ఎన్‌సీఎల్ పరిశ్రమ స్థాపించాక మట్టపల్లి గ్రామానికి రాకపోకలు పెరిగాయి. మూడున్నర దశాబ్దాల అనంతరం మట్టపల్లి గ్రామం పంచాయతీగా ఏర్పడింది. ఒకప్పుడు ఐదు కుటుంబాలతో ఉన్న గ్రామం ప్రస్తుతం పంచాయతీ పరిధిలో 1,600పైగా జనాభా, 1,200పైగా ఓటర్లకు చేరింది. ఎన్‌సీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న 500 మంది కార్మికులు కాలనీలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ కంపెనీలో పనిచేసేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి కార్మికులుగా జీవిస్తున్నారు. పరిశ్రమ చుట్టుపక్కల తండాలు, గ్రామాలకు చెందిన మరో 500 మంది కార్మికులు ఈ సిమెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.

### మట్టపల్లి క్షేత్రం

మట్టపల్లి క్షేత్రాన్ని ఒకప్పుడు చుట్టుపక్కల వారు మాత్రమే దర్శించుకునేవారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రానికి చెందిన భక్తులు కూడా సందర్శిస్తున్నారు. అన్నసత్రాలకు పేరుగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ప్రతీ సామాజిక వర్గానికి సంబంధించిన సత్రం ఉండటం విశేషం. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు కనీస సౌకర్యాల కల్పన పెరిగింది. దీనికి తోడు తమిళనాడుకు చెందిన ముక్కూరు పీఠాధిపతులు ఇక్కడ తమ కార్యకలాపాలను చేపట్టడంతో క్షేత్ర ప్రాశస్త్యం ఇతర రాష్ట్రాలకు వ్యాప్తి చెందింది. ప్రస్తుతం రోజూ స్వామి వారి దర్శనానికి భక్తులు వస్తున్నారు. దీంతో మట్టపల్లి క్షేత్రం రెండో యాదాద్రిగా పేరు గడిస్తోంది.



### పర్యాటక కేంద్రంగా గుర్తించాలి

దినదినాభివృద్ధి చెందుతున్న మట్టపల్లి క్షేత్రాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరుపొందుతున్న మట్టపల్లి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తే తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల భక్తుల రాక మరింత పెరుగుతుంది. ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంది.



చెన్నూరి మట్టపల్లిరావు, చైర్మన్, మట్టపల్లి క్షేత్రం

### పరిశ్రమ రాకతో మట్టపల్లి గ్రామానికి గుర్తింపు



ఇంతకుముందు ఈ ప్రాం తంలో దట్టమైన అటవీ ఉండటంతో జంతువుల భయంతో బయటకు వచ్చే వారు కాదు. ఆనాటి గ్రామాపరిపాలనాధికారులు చెన్నూరి నర్సింహారావు, బజ్జూరి వెంకటనర్సయ్య సహకారంతో మట్టపల్లిలో సిమెంట్స్ పరిశ్రమకు రామచంద్రరాజు పూనుకున్నారు. దీంతో మట్టపల్లి గ్రామానికి గుర్తింపు వచ్చింది. నేడు 300పైగా గృహాలతో మట్టపల్లి క్షేత్రం విరాజిల్లుతోంది.

రామిశెట్టి అప్పారావు, మట్టపల్లి గ్రామం

### ● ఎన్‌సీఎల్ రాకతో..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 1982లో ఉత్తమ కార్మిక సంక్షేమ అవార్డు పొందిన పారిశ్రామికవేత కలిదిండి రామచంద్రరాజు సిమెంట్ పరిశ్రమ నెలకొల్పాలన్న లక్ష్యంతో మట్టపల్లి ప్రాం తానికి వచ్చారు. ఆనాటి గ్రామ పరిపాలనాధికారులు చెన్నూరి నర్సింహారావు, బజ్జూరి వెంకటనర్సయ్య సహకారంతో మట్టపల్లి గ్రామంలో నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ(ఎన్‌సీఎల్) నిర్మాణానికి రామచంద్రరాజు పూనుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలు, గిరిజనతండాలకు చెందిన ప్రజలు రోజువారీ కూలీలుగా, చదువుకున్న యువకులు, సాంకేతిక విద్యను అభ్యసించిన యువకులతో పరిశ్రమ నిర్మాణాన్ని కొద్ది నెలల్లోనే పూర్తిచేశారు. దీంతో పరిశ్రమలోకి కార్మికుల అవసరం పెరగడంతో పాటు నిర్మాణ సమయంలో కార్మికులకు ఆవాసంగా మట్టపల్లి గ్రామం నిలిచింది. ఒకప్పుడు నడవలేని స్థితిలో రోడ్డు, రవాణా, విద్యుత్ సౌకర్యం లేని భయంకరమైన దట్టమైన అడవిని కలిగి కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ఈ గ్రామంలో నా గార్జున సిమెంట్ పరిశ్రమ స్థాపనతో రహదారులు, విద్యుత్, మంచినీరు తదితర సౌకర్యాలు మెరుగుపడ్డాయి.

## ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ షాపింగ్ పండుగల సమయంలో ఆఫర్లు ప్రకటించడం, ఆఫర్లను కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవడం పరిపాటి. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరిట పంపుతున్న లింకులతో పలువురు మోసపోతున్నారు. ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ సంస్థల లోగోలను కాపీ చేస్తూ సెల్‌ఫోన్లకు పంపుతున్న నకిలీ ఆఫర్లకు పలువురు ఆకర్షితులవుతున్నారు. ఆ లింకులను ఓపెన్ చేస్తూ నష్టపోతున్నారు. నాలుగేళ్లుగా దేశ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ. 3,207 కోట్లు కొల్లగొట్టగా 5.82 లక్షల కేసులు నమోదైనట్లు పోలీస్ రికార్డులు పేర్కొంటున్నారు. వెలుగు చూడని దారుణాలు మరెన్నో ఉన్నాయి. దీంతో అవగాహనతోనే మోసాలను అరికట్టవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

● భువనగిరి టౌన్, (ఆంధ్రజ్యోతి)

### నకిలీ ఆఫర్లతో మోసపోవద్దు



పండుగ సమయంలో వచ్చే నకిలీ ఆఫర్లతో మోసపోవద్దు. ప్రధాన వాణిజ్య సంస్థల లోగోలను పోలి ఉండే లింకులు అందరి సెల్‌ఫోన్లను ముంచెత్తుతున్నాయి. ఆఫర్లను చూసి అత్యాశతో లింకుపై క్లిక్ చేసినా, ఓటీపీ నెంబర్ చెప్పినా వెంటనే బ్యాంకు ఖాతాలు లూటీ అవుతాయి. ఈ తరహా మోసాలు ఆప్టికల్స్ విభాగంలోనూ వెల్లువెత్తుతున్నాయి. జాగ్రత్తగా గమనించాకే క్లిక్ చేస్తే మంచిది.

●పి. మాధవి, హరిహరన్ ఆప్టికల్స్, భువనగిరి.

### అత్యాశకు పోవద్దు



భారీ రాయితీతో కూడిన ఆఫర్లను నమ్మి మోసపోవద్దు. మొబైల్స్‌కు వస్తున్న ఫేక్ ఆఫర్లతో అత్యాశకు పోయి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసుకోవద్దు. ప్రధాన సంస్థల ఆఫర్లను సంబంధిత సంస్థల వెబ్‌సైట్‌లను సందర్శిస్తే వాస్తవాలు తెలుస్తాయి. తొందరపాటులో ఓటీపీ నెంబర్లు చెప్పడం, తెలియని లింకులను క్లిక్ చేయడం మంచిది కాదు.

● డాక్టర్ జె. భరత్, భువనగిరి.

### యువత శాతమే అధికం



ఆన్‌లైన్‌లలో వచ్చే నకిలీ ఆఫర్లకు యువత అధికంగా మోసపోతున్నారు. మొదటగా చిన్న ఆఫర్లతో ప్రలోభపెడుతూ భారీ మొత్తంలో రాయితీ లేదా పెట్టుబడులకు రెట్టింపు పేరిట వచ్చిన ఆఫర్లలో భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతూ మోసపోతున్నారు. ప్రత్యేకించి పండుగ పేరిట వచ్చే ఆఫర్లను నిర్ధారించుకున్నాకే ప్రాసెస్ చేస్తే మంచిది. యువత అప్రమత్తంగా ఉండాలి. నకిలీ లింకులను ఓపెన్ చేసి ఆర్థికంగా నష్టపోవద్దు.

● పోతంశెట్టి నితిన్‌కుమార్, బీటెక్, భువనగిరి

### ఫోన్ల పేరిట మోసాలు



పండుగల ఆఫర్లలో ఫోన్లను కొనుగోలు చేసేందుకు చాలామంది ఎదురుచూస్తుంటారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు విసురుతున్న నకిలీ ఆఫర్లతో మోసపోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. రూ.40వేల విలువ చేసే ఫోన్లను రూ.20వేలకే పండుగ ఆఫర్లలో కొనుక్కోవచ్చని వస్తున్న లింకులను క్లిక్ చేస్తూ పలువురు మోసపోతున్నారు.

● వెంకట్ చెన్నోజు, ఎంకే మొబైల్స్, భువనగిరి.

# ఏదుల నుంచి డిండికి..

- 'డిండి' పథకంలో కీలక అడుగు
- 60 రోజుల్లో 30 టీఎంసీలు
- నీరు తీసుకోవాలని నిర్ణయం
- ఏదుల నుంచి ఉల్పర వరకు బ్యారేజీ
- పనులకు రూ.2200 కోట్ల అంచనా వ్యయం
- మూడేళ్లలో ఆయకట్టుకు నీరివ్వాలని సంకల్పం



దాదాపు నిర్మాణం పూర్తయిన శివన్నగూడెం రిజర్వాయర్

నల్లగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): డిండి ఎత్తిపోతల పథకానికి నీరెక్కడి నుంచి తీసుకోవాలనే విషయంలో ప్రభుత్వం స్పష్టతకు వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏదుల నుంచి ఉల్పర రిజర్వాయర్ వరకు చేపట్టే ప్రధాన పనులను రూ.2200 కోట్ల అంచనావ్యయంతో టెండర్లు పిలవాలని నిర్ణయించారు. రాబోయే మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తిచేయాలనే లక్ష్యం నిర్ణయించుకున్న ప్రభుత్వం ఈ మేరకు పనుల వేగవంతానికి కార్యాచరణ మొదలుపెట్టింది.

### ఏదుల నుంచి 60 రోజుల్లో 30 టీఎంసీల నీరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 3.40లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 1000 గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో 2015లో ఆర్.విద్యాసాగర్‌రావు డిండి ఎత్తిపోతల పథకం చేపట్టారు. ఈపథకానికి పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కలిపి శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇటీవలి వరకు ఎక్కడ నుంచి నీటిని సేకరించాలనే విషయంలో నిర్ణయం తీసుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక డిండి ఎత్తిపోతలపై రైతాంగం నుంచి వస్తోన్న ఒత్తిడి నేపథ్యంలో ఈ పథకానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులు చేపట్టేందుకుటెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు. సెప్టెంబరు 20వ తేదీన నల్లగొండ జిల్లాలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం వద్ద నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. అంతేకాక ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఈ పథకాన్ని చేర్చి రెండేళ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు.



పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

### పనులకు రూ.2200 కోట్ల అంచనావ్యయం

ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీ వరకు అవసరమయ్యే నిర్మాణాలకు రూ.2200 కోట్లు అంచనావ్యయమవుతుందని ఇంజనీర్లు ప్రతిపాదించారు. ఆ మేరకు టెండర్లు ఆహ్వానించాలని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ నిర్మాణంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్ ఛానల్, 2.525 కిలో మీటర్ల ఓపెన్ కెనాల్, 9 మీటర్ల డయాతో 16 కిలోమీటర్ల టన్నెల్, మళ్లీ 3.050 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ నిర్మిస్తారు. మొత్తం 21.575 కిలోమీటర్ల తర్వాత ఈ నిర్మాణం దుందుభి నదిలోకి వెళుతుంది. అక్కడ నుంచి 6.325 కిలో మీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్‌కు 1.500 కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బ్యారేజీని నిర్మిస్తారు. ఈ బ్యారేజీ నుంచి డిండి మెయిన్ కెనాల్ ప్రారంభమవుతుంది. ఈ మెయిన్‌కాల్వ ఉల్పర నుంచి శివన్నగూడెం వరకు 66.300 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 27.29 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి.

### భూసేకరణ కోసం కసరత్తు

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తోన్న ఎనిమిది రిజర్వాయర్లతో పాటు, ప్రధాన కాల్వ, తాజాగాప్రతిపాదించిన హెడ్‌వర్క్స్‌కు సంబంధించిన నిర్మాణాలకు అవసరమైన భూమిని సేకరించే విషయంలో ప్రభుత్వం కసరత్తు కొనసాగిస్తోంది. తాజాగా ప్రతిపాదించిన ఏదుల రిజర్వాయర్ నుంచి ఉల్పర బ్యారేజీ వరకు చేపట్టే కీలకమైన పనులకు గాను అవసరమైన భూసేకరణకు డిజైన్ ఇంకా ఖరారుకాలేదు. ఉల్పరకు దిగువ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన కాల్వ, డిండి ప్రాజెక్టు ఎత్తు పెంపు, అప్రోచ్ ఛానల్స్, సింగరాజుపల్లి, ఎర్రవల్లి-గోకారం, ఇర్విన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణాలకు గాను దాదాపు 16,389 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 12,317 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 4,072 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని గోకారం-ఎర్రవల్లి రిజర్వాయర్ కింద నిర్వాసితులయ్యే ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాలకు చెందిన గ్రామస్థులకు, నల్లగొండ జిల్లాలో కిష్టరాంపల్లిలో నిర్వాసితులయ్యే నాంపల్లి మండలం లక్ష్మణపురం, చింతపల్లి మండలం ఈదులగూడెం గ్రామస్థులకు, శివన్నగూడెం రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితులయ్యే చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లి తండాల నిర్వాసితులకు సంబంధించి దాదాపు 1899 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉండగా, ఇప్పటివరకు ప్యాకేజీలు కుదరకపోవడంతో సదరు నిర్వాసితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. వీరికి పునరావాసం కల్పించే అంశంపై కలెక్టర్లు, ఎమ్మెల్యేలు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. త్వరలోనే నిర్వాసితుల సమస్యలపై కొలిక్కి తెచ్చి పథకాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు.

### మూడేళ్లలో ప్రాజెక్టు పనుల పూర్తికి కృషి



డిండి ఎత్తిపోతల పథకాన్ని మూడేళ్లలో పూర్తిచేయాలనే ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పనులు వేగవంతం చేశాం. రిజర్వాయర్ల పనులు దాదాపు కొలిక్కివచ్చాయి. భూసేకరణలో నిర్వాసితులకు తగు పరిహారాలు, ప్యాకేజీలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే భూసేకరణ కొలిక్కివస్తుంది. ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించారు. ఈ మేరకు అక్కడి నుంచి ఉల్పర వరకు బ్యారేజీ, సొరంగాలు, ప్రధానకాల్వల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. అన్ని పనులు మూడేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యంగా మేం పనిచేస్తున్నాం.

● వెంకటేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌వీఆర్‌డీఎల్ఐ ప్రాజెక్టు

### చికెన్ ధరలు

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.150 | 230 | 260 |
| సూర్యాపేట | రూ.130 | 200 | 230 |
| నల్లగొండ | రూ.132 | 200 | 226 |

### సాగర్ సమాచారం

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 590.00 అడుగులు |
| టీఎంసీలు | 312.0450 |
| ప్రస్తుత నీటి మట్టం | 589.90 |
| టీఎంసీలు | 311.7462 |
| ఎడమకాల్వకు నీటి విడుదల | 7,190 |
| కుడికాల్వకు | 10,120 |
| విద్యుత్ కేంద్రం ద్వారా | 29,354 |
| క్రస్ట్ గేట్ల ద్వారా | 19,880 |
| ఎస్‌ఎల్‌బీసీ ద్వారా | 2,400 క్యూసెక్కులు |
| వరద కాల్వ ద్వారా | 400 క్యూసెక్కులు |
| ఇన్‌ఫ్లో | 43,6643 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 49,464 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | 0 |

### పులిచింతల ప్రాజెక్టు

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి నిల్వ | 45.77 టీఎంసీలు |
| ప్రస్తుత నీటి నిల్వ | 43.79 టీఎంసీలు |
| పులిచింతలకు నీటి రాక | 28,064 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 44,273 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | 2 |

### మూసీ నీటిమట్టం

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 645 అడుగులు |
| టీఎంసీలు | 4.46 |
| ప్రస్తుత నీటి మట్టం | 644 అడుగులు |
| టీఎంసీలు | 4.20 |
| ఎన్ని గేట్ల ద్వారా | 1 గేటు |
| ఇన్‌ఫ్లో | 755.85 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 755.85 క్యూసెక్కులు |

### గోవుల వాహనం పట్టివేత

చౌటుప్పల్‌రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ హన్‌మాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్ కబేళాకు డీసీఎంలో 61 గోవులను తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నకిరేకల్‌కు చెందిన డ్రైవర్ అన్వర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గోవులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

- ఇద్దరు విద్యార్థులు మృతి
- యదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



మోటకొండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఇద్దరు యువకుల ప్రాణం తీసింది. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు ఆవాస గ్రామం అబీద్‌నగర్‌లో ఈ విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబీద్‌నగర్ గ్రామానికి చెందిన యెగమటి రాహుల్‌రెడ్డి హైదరాబాద్‌లోని రామంతాపూర్ గల శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవుల నేపథ్యంలో రాహుల్‌రెడ్డి ఆహ్వానం మేరకు కళాశాలలో చదువుతున్న 11మంది విద్యార్థులు బుధవారం అబీద్‌నగర్ గ్రామానికి వచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో సరదాగా గడిపేందుకు స్నేహితుని వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి అక్కడ పొలాల్లో కలియదిరిగారు. పక్కనే ఉన్న బస్వరాజ్ కుంటలో ఈత కొట్టేందుకు డొంకెన శ్రీచరణ్, (27), నంగునూరి శశివరుణ్ (18) దిగారు. వారికి ఈత రాక నీటిలో మునిగిపోతుండటంతో గమనించిన మరో విద్యార్థి కాపాడేందుకు ప్రయత్నంలో కాలుజారి నీటిలో పడ్డాడు. పక్కనే ఉన్న రాహుల్‌రెడ్డి లాగటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కుంటలోకి దిగిన ఇద్దరు విద్యార్థులు మునిగిపోగా, పక్కనే ఉన్న విద్యార్థులు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. దీంతో గ్రామస్థులు కుంటలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. మృతులు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం గౌరెల్లికి చెందిన డొంకెన శ్రీచరణ్, మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మండలం బోడుప్పల్‌కు చెందిన నంగునూరి శశివరుణ్‌గా పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ రమేష్ కుమార్, సీఐ కొండల్‌రావు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డొంకెన శ్రీచరణ్ తండ్రి బాలరాజు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

## 'బాలసదనం' ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

- నలుగురికి షోకాజ్ నోటీసులు ● జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, సీడబ్ల్యూసీ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని బాలసదనం

భువనగిరి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని బాలసదనంలో బాలికలపై లైంగిక వేధింపుల ఘటనలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో 14వ తేదీన బాలసదనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఓ బాలిక లైంగిక వేధింపులకు గురి కాగా ఈ నెల 20వ తేదీన ఘటన వెలుగుచూసింది. దీంతో జిల్లా న్యాయ సేవా సంస్థ అధికార సంస్థలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అటెండర్ వెంకటరెడ్డిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనపై 21వ తేదీన బాలసదనం సూపరింటెండెంట్, సూపర్‌వైజర్, డీసీపీవోకు జిల్లా కలెక్టర్ మెమోలు జారీ చేశారు. సీడీపీవో శైలజ నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మెమోలు అందుకున్న అధికారుల వివరణలు, విచారణ కమిటీ నివేదిక ఆధారంగా 28వ తేదీన డీసీపీవో పి.సైదులు, పీవోఐసీ అలివేలు, బాలసదనం సూపరింటెండెంట్ లలిత, సూపర్‌వైజర్ మహాలక్ష్మి షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీంతో షోకాజు నోటీసులు అందుకున్న అధికారులు బుధవారం సాయంత్రం నాటికి సంజాయిషీ లేఖలు అందజేసినట్లు తెలిసింది. రాత్రి 7 గంటల తర్వాత నలుగురు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు బాలసదనంలోకి ప్రవేశించడం, ఒకరు మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేయడంపై జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శికి కలెక్టర్ లేఖ రాశారు. ఈ ఘటనపై న్యాయసేవా అధికార సంస్థ అంతర్గత విచారణను చేపట్టినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన వెంటనే బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) స్పందించకపోవడం, తదుపరి చర్యలు తీసుకోవడంలో చూపిన ఆలస్యంపై సంబంధిత శాఖ కమిషనర్‌కు బుధవారం కలెక్టర్ లేఖ రాసినట్లు ప్రచారం జరుగుతోంది. షోకాజ్ నోటీసులు అందుకున్న అధికారుల సంజాయిషీ, సీడబ్ల్యూసీ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దర్యాప్తు ఆధారంగా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## ట్రాక్టర్ దూసుకెళ్లి రైతు మృతి

- మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం
- నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఘటన





పొలంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్, మృతి చెందిన జనార్దన్ (ఫైల్)

తిప్పర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి వెళ్లడంతో ఓ రైతు మృతి చెందాడు. బుధవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. తిప్పర్తి ఎస్ఐ బి.సాయిప్రశాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయినిగూడెం గ్రామానికి చెందిన మేడిశెట్టి జనార్ధన్ (46) తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాడు. బుధవారం మధ్యాహ్నం భార్య లక్ష్మమ్మతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. వరికోత యంత్రంతో పంటను కోయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ట్రాక్టర్ కిందికి దిగి చూడగా లైట్లకు సంబంధించిన వైర్లు ఊడిపోయి ఉండటాన్ని గమనించి వాటిని కలిపేందుకు ఇంజన్ కిందకు వెళ్లాడు. వైర్లను కలపడంతో ట్రాక్టర్ ఇంజన్ స్టార్ట్ కాగా, అప్పటికే వాహనం గేర్‌లో ఉండటంతో ముందుకు కదిలి రైతు పైనుంచి ఇంజన్‌తో పాటు ట్రాలీ కూడా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో జనార్ధన్‌కు కాలు విరగడంతో పాటు ఛాతీకి, తలకు బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలోనే ఉన్న భార్య విలపిస్తూ బంధువులకు, 108 వాహనానికి ఫోన్ చేయడంతో వారు వచ్చి చూసేలోగా జనార్ధన్ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. జనార్ధన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

## ఎక్సైజ్ అధికారుల దాడులు

- పది లీటర్ల నాటుసారా ● 50 కేజీల నల్లబెల్లం స్వాధీనం

దేవరకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించి అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎక్సైజ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆటోల్లో హైదరాబాద్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 450 కేజీల నల్లబెల్లం, 50 కేజీల పట్టిక, పది లీటర్ల నాటుసారను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రదీప్‌రావుతో పాటు అధికారులు పాల్గొన్నట్లు సీఐ పేర్కొన్నారు.

## టోల్‌గేట్ వద్ద డ్రగ్స్ పట్టివేత

చౌటుప్పల్‌రూరల్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద బుధవారం రాత్రి వంద గ్రాముల డ్రగ్స్ (ఎమ్‌డీఎంఏ)ను పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లింగంపల్లి నుంచి రాజస్థాన్‌కు మారుతి స్విఫ్ట్ కారులో 100 గ్రాముల డ్రగ్స్ తరలిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు పంతంగి టోల్‌గేటు వద్ద మాటు వేశారు. కారును నిలిపివేసి తనిఖీ చేసి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్న రాజస్థాన్‌కు చెందిన చైల్‌సింగ్ (38), సుమేర్ సింగ్ (29)లను అదుపులో తీసుకొని అరెస్టు చేశారు. వంద గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాని విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

## నల్లగొండలో భారీ వర్షం

నల్లగొండ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం చల్లబడి వర్షం పడింది. కొద్ది రోజులుగా ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. కాగా నల్లగొండ శివారు ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయింది. ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు ఇబ్బందులు పడుతూ ధాన్యం రాశులపై పట్టాలు కప్పారు. నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో నాలాలు పొంగిపొర్లడంతో పలు ఇంట్లోకి వర్షం నీరు, మురుగు వచ్చి చేరింది. పానగల్ బైపాస్ వద్ద వర్షపు నీరు చెరువును తలపించింది.



నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ ఇంట్లోకి వచ్చిన బురద



ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో వర్షానికి పోతున్న ధాన్యాన్ని పట్టాపై పోస్తున్న రైతు



జలసంద్రమైన పానగల్ బైపాస్ చౌరస్తా

## జాన్‌పహాడ్‌లో ఆధిపత్యం కోసమే హత్యాయత్నం : సీఐ

హుజూర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్‌లో ఎలక్ట్రానిక్ విలేకరిపై కత్తులతో చేసిన దాడి ఆధిపత్యంలో భాగమేనని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని జాన్‌పహాడ్‌కు చెందిన వెచ్చా సందీప్ ఒక టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన షేక్ జహంగీర్ సూర్యాపేట పట్టణంలో కారుడ్రైవర్‌గా పనిచేస్తూ అప్పుడప్పుడు స్వంత గ్రామమైన జాన్‌పహాడ్‌కు వచ్చిపోతుంటాడు. స్నేహితులైన సందీప్, జహంగీర్ మధ్య గ్రామంలో ఆధిపత్యం విషయంలో వివాదాలు తలెత్తాయి. అంతేకాక పలు ఘటనల్లో జహంగీర్ ఆధిపత్యానికి అడ్డు తగులుతున్నాడని సందీప్‌ను ఎలాగైనా చంపాలనుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 27న సూర్యాపేటలో తన స్నేహితుడైన ఫణికి చెందిన కారులో ఇద్దరు కలిసి జాన్‌పహాడ్‌కు వచ్చారు. గ్రామంలోని తన బంధువైన షేక్ సైదులు చికెన్‌షాపు వద్ద కత్తిని తీసుకొని బైక్‌పై దర్గా వద్ద ఉన్న సందీప్ ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో ఉబ్బపల్లి సందీప్ బయట కాపలా ఉండగా, జహంగీర్, ఫణి ఇద్దరు సందీప్ ఇంట్లోకి వెళ్లారు. ఆగ్రహంతో జహంగీర్ కత్తితో సందీప్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. సందీప్ కేకలు వేయడంతో ఇరుగుపొరుగు రావడంతో సందీప్‌కు చెంది స్కూటీ తీసుకుని పారిపోయారు. బుధవారం జాన్‌పహాడ్ శివారులో దాచి ఉంచిన ఎర్టీగా కారును తీసుకోవడానికి జహంగీర్, ఫణి ఇద్దరు వచ్చారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేశారు. కాగా కేసులో నిందితులుగా ఉన్న ఉబ్బపల్లి సందీప్, షేక్ సైదులు, బాణోత్ సైదులు, షేక్ సలాముద్దీన్‌లను పట్టుకున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. వారితో పాటు ఎర్టీగా కారు, రెండు మోటార్ సైకిళ్లు, సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. దాడిలో గాయపడిన సందీప్ అయ్యప్ప మాల ధరించి ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, కానిస్టేబుల్ నాగరాజు, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

### రూ.6.50లక్షల

## విలువైన రోల్ రూ.లక్షకే విక్రయం

- వైటీపీఎస్‌లో 28 రోల్స్ చోరీ ● ఐదుగురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో 28 అల్యూమినియం రోల్స్ చోరీ చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు కేసు వివరాలు వెల్లడించారు. గత నెలలో వైటీపీఎస్‌లో జరిగిన కాపర్ దొంగతనం కేసులో పరారీలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హైడ్రా సూపర్‌వైజర్లు రంజిత్‌కుమార్‌వర్మ, అభయ్ ప్రతాప్ మౌర్యలను అదుపులోకి తీసుకుని విచారించగా, అల్యూమినియం రోల్స్ చోరీ నిందితుల గురించి వెల్లడించారు. వైటీపీఎస్ నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్‌కు చెందిన సబ్ కాంట్రాక్టు కంపెనీ దుర్గా క్రేన్ సర్వీసెస్ సంస్థ అల్యూమినియం రోల్స్ దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో మిర్యాలగూడకు చెందిన షేక్ మున్నీర్, దామరచర్లకు చెందిన కంబాల అశోక్, మిర్యాలగూడ మండలం ఇర్కిగూడేనికి చెందిన గోపిశెట్టి అజయ్, పసుపులేటి కోటేశ్వరావు, సెక్యూరిటీ గార్డు పుల్లయ్య సాయంతో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీహెచ్ఈఎల్ యార్డు పరిసరాల్లో స్టోర్ యార్డులోని అల్యూమినియం రోల్స్‌ను హైడ్రాల ద్వారా కిరాయికి తెచ్చిన వాహనాల్లోకి ఎక్కించి హైదరాబాద్‌లోని పాత ఇనుము వ్యాపారులు షేక్ షర్ఫొద్దీన్, ఖైరొద్దీన్, ముజీబ్, వహీద్‌అలీ అనే వ్యాపారులకు విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. 28 అల్యూమినియం రోల్స్ చోరీ అయినట్లు కంపెనీ నిర్వాహకులు గుర్తించారని తెలిపారు. కాగా ఒక్కో రోల్స్ విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.6.50లక్షలు కాగా ఒక్కో రోల్‌ను పాత ఇనుప కొట్టులో రూ.లక్షకే విక్రయించినట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురు నిందితుల అదుపులోకి తీసుకుని వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.15,35,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, ఏఎస్ఐ అఫ్జల్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలోని డీఎస్పీ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు



















# సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి ● జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లకు శిక్షణ

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం నుంచి సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. కనగల్,డిండి, గుర్రంపోడు మండలాల్లో నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆమె పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఇచ్చిన ఫారాల్లో ఉన్న 75రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరించి క్షుణ్ణంగా నింపాలన్నారు. సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల విషయాలను సవివరంగా నమోదు చేయాలని సూచించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి తగిన ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేయడానికి సర్వే ఉపయోగపడుతుందన్నారు. అలాగే కట్టంగూర్, చిట్యాలలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ వేములపల్లి, మాడ్గుల పల్లి


కనగల్‌లో ఎన్యుమరేటర్ల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

శిక్షణలో సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ పాల్గొన్నారు. తిప్పర్తిలో మండల ప్రత్యేకాధికారి ఛాయాదేవి, కొండమల్లేపల్లిలో మండల ప్రత్యేకాధికారి విజయేందర్‌రెడ్డి, ఎంపీడీ వో బాలరాజు రెడ్డి, చింతపల్లిలో ప్రత్యేకాధికారి ద్వారక్, ఎంపీడీవో సుజాత, శాలిగౌరారంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

## సబ్ మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషి

కనగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కనగల్ ఎక్స్‌రోడ్డులోని వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. రూ. 35లక్షల నిధులతో నిర్మించే కనగల్ సబ్ మార్కెట్ యార్డు ప్రహరీ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి సుమారు రూ. 20 లక్షలతో మట్టిని పోసి చదును చేసి ఐకేపీ దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనాథరాజు, సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ నాయకులు నర్సింగ్ క్రిష్ణయ్యగౌడ్, పరశురాం, సైదిరెడ్డి, ఆవులపరమేష్, చంద్రయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

» ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


దేవరకొండలో కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధ వారం దేవరకొండ మార్కెట్‌యార్డులో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీచేసి మాట్లాడా రు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయిని మాధవరెడ్డి, పల్లా నర్సింహారెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు నర్సింహ, సంజీవ, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మూసీ పర్రె కాలువను అభివృద్ధి చేయాలి

కేతేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మూసీ పర్రె కాలువను అభివృద్ధి చేసి నీరు సక్రమంగా అందేలా చూడాలని కోరుతూ మండలంలోని భీమారం గ్రామ రైతులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి బుధ వారం ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. మూసీ నది నుంచి భీమారం వరకు గల పర్రె కాల్వపై ఉప్పలపహాడ్, కొప్పోలు గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు చిన్నపాటి సిమెంటు గూనలతో నిర్మించుకున్న కల్వర్టుల వద్ద చెత్త పేరుకుపోయి చివరన ఉన్న భీమారం వరకు నీరు రావడం లేదని వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు బడుగుల నరేందర్ యాదవ్, రైతులు డి.రామచంద్రయ్య, బి.ఆనందం, బి.పరమేష్, ఎర్రయ్య పాల్గొన్నారు.




## అధిక మొత్తంలో డిపాజిట్లు సేకరించాలి

» డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


డిపాజిట్ల సేకరణ కరపత్రం ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డీసీసీబీ పరిధిలోని బ్యాంకుల మేనేజర్లందరూ పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో బుధవారం ఆయన డిపాజిట్ల సేకరణ మాసోత్సవ కరపత్రాలను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని అన్ని బ్రాంచ్ మేనేజర్లతో మాట్లాడుతూ అధిక డిపాజిట్లను సేకరించడానికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సీఈఓ ఆర్.శంకర్ రావు, బ్యాంకు డీజీ ఎంలు, ఏజీ ఎంలు, బ్యాంకు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు: మునుగోడు వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి బుధ వారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి కత్తుల రవి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.










## రేపటి నుంచి కబడ్డీ పోటీలు

హాలియా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలియా జడ్పీహెచ్‌ఎస్ ప్రథమ ప్రధానోపాధ్యాయుడు ము దుంబై రామానుజాచార్యులు ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్ర వారం నుంచి నాగార్జున సాగర్ నియోజకవర్గ పాఠశాల స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వ హిస్తున్నట్లు జడ్పీహెచ్‌ఎస్ హాలియా పూర్వ విద్యార్థులు తెలిపారు. బుధ వారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పూర్వ విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

## ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నట్లు ఈవో సీహెచ్. వెంకటనారాయణ బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఆసక్తిగల వారు గురువారం నుంచి 20 రోజుల్లోపు దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం లో సమర్పించాలని ఆయన సూచించారు.













